## 141. సిసలైన ప్రార్థన

న్యూయార్క్‌లోని జానెట్ అనే ఆమెకి ఓ సారి బ్రెస్ట్ కేన్సర్ అవగాహనకి సంబంధించిన ఓ సెమినార్‌కి ఆహ్వానం వచ్చింది. తన తల్లికి ఆ జబ్బు వచ్చింది కాబట్టి దానికి వెళ్తూ ఆమె తన చెల్లెలు మేరీని కూడా వెంటతీసుకు వెళ్ళింది. అందులో పాల్గొన్న డాక్టర్లు ఆ వ్యాధి వంశపారంపర్యంగా వచ్చే అవకాశం ఉందని చెప్పారు. దాన్ని మొదట్లోనే ఎలా కనుక్కోవాలి మొదలైన విషయాలు వివరించాక ఓ డాక్టరు చెప్పాడు.

"స్టాటిస్టిక్స్ ప్రకారం ఈ గదిలోని ప్రతీ ఏడుగురిలో ఒక్కరికి తప్పక బ్రెస్ట్ కేన్సర్ వచ్చే అవకాశం ఉంది."

జానెట్ ఆ రోజు నించి దైవ ప్రార్థన మొదలెట్టి నిత్యం ఇలా ప్రార్థించసాగింది.

'దేవుడా! నాకు బ్రెస్ట్ కేన్సర్ రాకుండా కాపాడు."

కాని ఆమెకి ఓ రోజు ఆ రోగం వచ్చిందని డయాగ్నైజ్ చేసిన డాక్టరు చెప్పాడు. దాంతో జానెట్ బాధగా తన చెల్లెలితో చెప్పింది.

"మనం బ్రెస్ట్ కేన్సర్ సెమినార్‌కి వెళ్ళినప్పటి నించీ నాకు ఆ రోగం రానివ్వద్దని డాక్టరుని ప్రార్థిస్తూనే ఉన్నా. కాని ఏం జరిగిందో చూడు."

వెంటనే ఆమె చెల్లెలు మేరి చెప్పింది.

"నేను కూడా ఆ రోజు నించి దేవుణ్ని ఆ విషయం మీద ప్రార్థిస్తున్నాను కాని నీలా కాదు. ఆ గదిలోని మిగిలిన ఆరుగురుకి బ్రెస్ట్ కేన్సర్ రాకుండా చేయమని ప్రార్థిస్తున్నాను."

## 142. నమ్మకం

ఓ ఊళ్ళోని ఓ వ్యాపారస్థుడు ఓ బార్‌ని తెరవడానికి లైసెన్స్ కోసం ప్రయత్నిస్తే అది మంజూరు అయ్యింది. ఐతే దాని సమీపంలోనే ఓ మఠం

ఉంది. ఆ మఠం వారికి అక్కడ బార్ రావడం ఇష్టంలేక అతని దగ్గరకి వెళ్ళి ఇంకెక్కడైనా బార్‌ని తెరవమని కోరారు. ఆ వ్యాపారస్థుడు అందుకు ఒప్పుకోలేదు.

దాంతో ఆ మఠంలోని వారంతా ఆ బార్ రాకుండా చూడమని ప్రార్థనలు చేయసాగారు. బార్‌ని తెరవడానికి ఓ రోజు ముందు పెద్ద పిడుగు పడి ఆ బార్ మొత్తం కాలిపోయింది. దాంతో ఆ వ్యాపారస్థుడు మఠంవారిని తనకి నష్టపరిహారం ఇవ్వమని కోరాడు. వాళ్ళు ఆ బార్ కాలడంలో తమ బాధ్యత ఎంతమాత్రం లేదని వాదించారు. ఆ వ్యాపారస్థుడు మఠం మీద కోర్టుకి వెళ్ళాడు.

ఆ కేసుని పరిశీలించిన జడ్జి ఇలా చెప్పాడు.

"వాద ప్రతివాదాలు విన్నాక ఈ కేసు తీర్పు ఎలా ఉంటుందో తెలీదు కాని, ఒకటి మాత్రం నిజం. బార్ యజమానికి ప్రార్థనల మీద నమ్మకం ఉంటే, వాటిని చేసిన మఠం వారికి లేదు."

## 143. స్వయంకృతం

మోటార్ సైకిల్ మీద వెళ్తున్న తన కొడుక్కి ఏక్సిడెంటయి, అతను అక్కడికి అక్కడే మరణించాడని తెల్సిన ఓ ఎం. ఎల్. ఏకి తెలిసింది. ఆ సమయంలో తన కొడుకు తాగి ఉన్నాడని తెలియగానే ఆయన శోకంతో కూడిన కోపంతో చెప్పాడు.

"నా కొడుకు మైనర్. తక్కువ వయసు గల వాడికి ఎవరు విస్కీ అమ్మారో వాడిని నేను చంపేస్తాను."

కొద్దిసేపాగి మనసు ఉపశమనానికి అతను తన విస్కీ సీసాలుంచుకునే అలమారా తలుపు తెరిచాడు. అందులోని ఓ బాటిల్ మిస్ అయిందని గుర్తించాడు. పక్కనే ఉన్న ఓ చీటీలో తన కొడుకు చేతి వ్రాతలో ఇలా ఉంది.